క్లుప్తంగా

భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేయండి

మంత్రి హరీశ్‌రావుకు యాదవ సంఘం నేతల వినతి


మంత్రి హరీశ్‌రావుతో యాదవ సంఘం ప్రతినిధులు

గజ్వేల్: నియోజకవర్గంలోని యాదవుల కోసం భవనం, ఫంక్షన్ హాల్ నిర్మాణానికి స్థలంతో పాటు నిధులు మంజూరు చేయాలని నియోజకవర్గంలోని యాదవ సంఘం నేతలు మంత్రి హరీశ్‌రావును కోరారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఆ సంఘం ప్రతినిధులు కుమార్, వర్గల్ జెడ్పీటీసీ బాలమల్లుయాదవ్, కూచారం రవీందర్‌యాదవ్, తూప్రాన్ ఎంపీపీ గడ్డి స్వప్నవెంకటేశ్‌యాదవ్‌ల నేతృత్వంలో సంఘం నాయకులు మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా తమకు గజ్వేల్ పట్టణంలో యాదవ సంఘ భవనం, ఫంక్షన్ హాల్ నిర్మాణానికి ఆదేశాలు ఇవ్వాలని కోరారు. స్పందించిన మంత్రి అక్కడి నుంచి గజ్వేల్ ఆర్డీఓ విజయేందర్‌రెడ్డికి ఫోన్‌చేసి స్థల సేకరణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మంత్రికి యాదవ సంఘం నేతలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన యాదవ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం


పనులను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ స్వరూపరాణి

చేర్యాల(సిద్దిపేట): పట్టణ పరిధిలోని 1వ వార్డులో రూ.5లక్షల వ్యయంతో చేపడుతున్న సీసీరోడ్డు పనులను మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణి ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఆడెపు నరేందర్, పచ్చిమడ్ల సతీశ్, రైతుబంధు కమిటీ జిల్లా సభ్యుడు అంకుగారి శ్రీధర్‌రెడ్డి, మున్సిపల్ మేనేజర్ ప్రభాకర్, సిబ్బంది, వార్డుప్రజలు, నాయకులు పాల్గొన్నారు.

కాల్వ నిర్మాణాన్ని నిలిపివేయాలి

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని ఆకునూరు రెవెన్యూ పరిధిలో చేపడుతున్న దేవాదుల కుడి కాల్వ నిర్మాణ పనులు నిలిపివేయాలని కోరుతూ ఆకునూరు, రాంపూర్ గ్రామాలకు చెందిన రైతులు నీటిపారుదల డీఈ రుద్రగౌడ్‌కు వినతిపత్రం అందించారు. మంగళవారం మండల పరిధిలోని రాంపూర్‌కు వచ్చిన నీటిపారుదల డీఈ, ఏఈలను కలిసిన రైతులు కాల్వ నిర్మాణంతో కలిగే నష్టాన్ని అధికారులకు వివరించారు. కాల్వ నిర్మాణంతో జీవనాధారం కోల్పోయి రోడ్డున పడతామని, తమ విన్నపాన్ని ఉన్నతాధికారులకు అందించి కాల్వ నిర్మాణం ఆపేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో రెండు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

జీలుగ విత్తనాలు పంపిణీ


విత్తనాలను పంపిణీ చేస్తున్న అధికారి రామకృష్ణ

మద్దూరు(హుస్నాబాద్): మండల కేంద్రంలోని అగ్రోస్ ఆధ్వర్యంలో జీలుగ విత్తనాల విక్రయాలను మంగళవారం మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీలుగ విత్తనాలతో భూసారం పెరుగుతుందన్నారు. విత్తనాలను ప్రభుత్వం రాయితీపై అందిస్తుందని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జనార్దన్ రెడ్డి, ఏఈఓలు రాకేశ్, అఖిల్, పంచాయతీ కార్యదర్శి వెంకన్న, అగ్రోస్ నిర్వాహకులు మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు బహుమతులు అందజేత


బహుమతులు ప్రదానం చేస్తున్న సర్పంచ్ శ్రీనివాస్

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని మోతె సర్పంచ్ కాలేరు శ్రీనివాస్ ఆధ్వర్యంలో మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ సోమవారం జరిగింది. చౌదర్‌పల్లి గ్రామానికి చెందిన క్రీడా టీమ్ మొదటి బహుమతితో పాటు రూ.5వేల నగదును గెలుచుకున్నారు. భూంపల్లి గ్రామానికి చెందిన టీమ్ ద్వితీయ బహుమతి, రూ.2 వేల నగదు గెలుచుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం అంజయ్య, నాయకులు చంద్రం, రాజేశ్వర్ తదితరులున్నారు.

అభివృద్ధిలో ఆదర్శంగా నిలపాలి

గజ్వేల్ మండల సమావేశంలో ఎంపీపీ దాసరి అమరావతి



పంచాయతీ కార్యదర్శి తీరుపై మండిపడుతున్న కొల్గూరు ఎంపీటీసీ జ్యోతిస్వామి

గజ్వేల్‌రూరల్: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ముందుకు సాగుతూ గ్రామాలను అభివృద్ధిలో ఆదర్శంగా నిలపాలని గజ్వేల్ ఎంపీపీ దాసరి అమరావతి పేర్కొన్నారు. పట్టణంలోని ఐవోసీ(ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్)లోగల సమావేశ హాల్‌లో మంగళవారం ఎంపీపీ దాసరి అమరావతి అధ్యక్షతన గజ్వేల్ మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీపీ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావుల చొరవతో గ్రామాలు అభివృద్ధిలో దూసుకుపోతున్నాయన్నారు. రాబోయే ఎన్నికల్లో మరోసారి బీఆర్ఎస్ పార్టీకి ఘన విజయం అందించాలని పిలుపునిచ్చారు. అనంతరం గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ మాట్లాడుతూ.. పోరాడి సాధించుకున్న తెలంగాణలో ప్రభుత్వం కొలువుదీరి పదేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంలో చేపట్టనున్న దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించాలన్నారు. ఈ సందర్భంగా కొల్గూరు ఎంపీటీసీ గొడుగు జ్యోతిస్వామి మాట్లాడుతూ.. గ్రామంలో వివిధ అభివృద్ధి పనుల కోసం ఎంపీటీసీ నిధులతో పాటు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైన గ్రామ పంచాయతీ కార్యదర్శి సంధ్య సహకరించకపోవడంతో ఏమి చేయలేకపోతున్నామని సభలో మండిపడ్డారు. గ్రామంలో జరిగే కార్యక్రమాలకు సమాచారం ఇవ్వడం లేదని, ప్రజల ఓట్లతో గెలుపొంది గ్రామాభివృద్ధి కోసం చేయాలనుకున్న పనులకు సంబంధించి తీర్మానం ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు మండల సభలో ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అదే విధంగా గ్రామాల్లో విద్యుత్ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, అధికారులు నిర్లక్ష్యం వహించకుండా సత్వరమే పరిష్కారానికి మార్గం చూపాలని పలువురు ప్రజాప్రతినిధులు మండల సభలో పేర్కొన్నారు. చివరగా ఎక్సైజ్ అధికారులు సమావేశానికి రాకుండా సిబ్బందిని పంపించడంపై అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ జేజేల వెంకటేశంగౌడ్, జెడ్పీటీసీ పంగ మల్లేశం, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు చెరుకు చంద్రమోహన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ బెల్దె కృష్ణాగౌడ్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు అశోక్, ఎంపీడీఓ మచ్చేందర్, తహసీల్దార్ బాల్‌రాజు, ఎంపీఓ దయాకర్‌తో పాటు ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత


హుస్నాబాద్: ట్రిపుల్ ఆర్ సెంటర్‌కు పాత వస్తువులు అందిస్తున్న స్థానికులు


సిద్దిపేటకమాన్: ప్రజలకు అవగాహన కల్పిస్తున్న చైర్‌పర్సన్ మంజుల, కమిషనర్ సంపత్‌కుమార్

హుస్నాబాద్: ఇంటి పరిసర ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి సంపూర్ణ ఆరోగ్యం పొందాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత అన్నారు. మంగళవారం పట్టణంలోని 6, 7వ వార్డుల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం, ట్రిపుల్ ఆర్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ రజిత మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించాలన్నారు. పొడి, తడి చెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనానికి అందించి స్వచ్ఛ వార్డుగా తయారు చేయాలన్నారు. తడి చెత్తతో ఇంటిలోనే ఎరువును తయారు చేసుకోవాలన్నారు. అదేవిధంగా ఇంటిలో ఉన్న పాత వస్తువులు, పుస్తకాలు, ప్లాస్టిక్ వస్తువులతో ఇతర పొడి వస్తువులను ట్రిపుల్ ఆర్ సెంటర్‌కు అందించాలన్నారు. ట్రిపుల్ ఆర్ సెంటర్ జూన్ 5వ తేదీ వరకు ప్రజలకు అందుబాటులో ఉంటుందని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజమల్లయ్య, వైస్ చైర్‌పర్సన్ అనిత, కౌన్సిలర్లు లావణ్య, పద్మ, మాజీ ఎంపీపీ వెంకట్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛ సిద్దిపేటకు కృషి చేయాలి

సిద్దిపేటకమాన్: స్వచ్ఛ సిద్దిపేటకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రాజనర్సు అన్నారు. పట్టణంలోని 35వ వార్డులో మున్సిపల్ చైర్‌పర్సన్ మంగళవారం పర్యటించారు. తడి, పొడి, హానికరమైన చెత్త వేరుచేసే విధానంపై మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్‌తో కలిసి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, వార్డు కౌన్సిలర్, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

పనులు వేగంగా చేయాలి

సిద్దిపేటజోన్: పట్టణంలో చేపట్టిన పారిశుధ్య పనులను వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ సంపత్ ఆదేశించారు. మంగళవారం స్థానిక 10వార్డులో ఆయన పర్యటించారు. మురికి కాల్వల్లో మట్టి తొలగింపు పనులు పరిశీలించారు. ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్‌లో భాగంగా ఈనెల 19 నుంచి 27వరకు అన్ని వార్డుల్లో పనులు చేపడతామని ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట కౌన్సిలర్ బాల్‌లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి


కొనుగోళ్లపై అధికారులతో మాట్లాడుతున్న శ్రీనివాస్

గజ్వేల్‌రూరల్: ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ పేర్కొన్నారు. పట్టణంలోని మార్కెట్ యార్డులో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం మాదాసు శ్రీనివాస్ మాట్లాడుతూ.. రైతులు అధైర్యపడొద్దని, ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా గన్నీ బస్తాలను అందుబాటులో ఉంచాలని, తూకం వేసిన ధాన్యాన్ని తరలించేందుకు లారీలను సైతం సమకూర్చాలని స్థానిక అధికారులకు సూచించారు. రైస్‌మిల్లర్లు లారీలను వెంటనే అన్‌లోడ్ చేసేలా చూడాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ సెక్రటరీ జాన్‌వెస్లీ, సూపర్‌వైజర్ మహిపాల్, మార్కెట్ సిబ్బంది, రైతులు తదితరులు ఉన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


అక్కన్నపేట మండల పరిషత్ కార్యాలయంలో..


గజ్వేల్‌లో క్షీరాభిషేకం చేస్తున్న ప్రజాప్రతినిధులు, కార్యదర్శులు

గజ్వేల్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయడం హర్షణీయమని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ(టీఎస్ఎఫ్‌డీసీ) చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం గజ్వేల్ మండల పరిషత్ కార్యాలయం వద్ద జేపీఎస్‌ల రెగ్యులరైజ్‌పై హర్షం వ్యక్తం చేస్తూ సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి జేపీఎస్‌లు చేస్తున్న కృషిని గుర్తించి సీఎం వారిని రెగ్యులరైజ్ చేశారని చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, ఎంపీపీ అమరావతి, జెడ్పీటీసీ మల్లేశం, సహకార సంఘం చైర్మన్ వెంకటేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దుబ్బాక: దౌల్తాబాద్ మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఎదుట సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసిన వారిలో జెడ్పీటీసీ రణం జ్యోతిశ్రీనివాస్‌గౌడ్, జిల్లా కో–ఆప్షన్ మెంబర్ రహీమొద్దిన్, ఎంపీడీఓ రాజేశ్ కుమార్, ఎంపీఓ సయ్యద్‌గఫూర్ ఖాద్రి, కార్యదర్శులు వెంటకటస్వామి, యాదగిరి, నరేశ్, ప్రత్యూష, మౌనిక తదితరులున్నారు.

జగదేవ్‌పూర్(గజ్వేల్): రెగ్యులరైజ్‌పై హర్షం వ్యక్తం చేస్తూ జగదేవ్‌పూర్ మండల కార్యాలయం ఎదుట కార్యదర్శులు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలేషంగౌడ్, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు కిరణ్‌గౌడ్, ఏఎంసీ వైస్ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి, కార్యదర్శులు వేణు, ప్రశాంత్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

హుస్నాబాద్‌రూరల్: మండల పరిషత్ కార్యాలయం ఎదుట సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసిన వారిలో ఎంపీపీ మానస, కార్యదర్శులు రాకేశ్, జ్యోతి, రాజేశ్వరి, శ్రీనివాస్‌రెడ్డి, సతీశ్, శ్రేయ, శ్రీనివాస్‌లు ఉన్నారు.

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి మండల పరిషత్ కార్యాలయంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసిన వారిలో ఎంపీపీ లింగాల నిర్మల, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు సంజీవరెడ్డి, జూనియర్ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండల కేంద్రంలోని ప్రజాపరిషత్ కార్యాలయం ఆవరణంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి ఎంపీపీ లక్ష్మితో పాటు జూనియర్ పంచాయతీ కార్యదర్శులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ లక్ష్మి మాట్లాడుతూ.. ఇచ్చిన మాట ప్రకారం క్రమబద్ధీకరణకు సీఎం కేసీఆర్ వారికి తీపికబురు చెప్పారన్నారు. గ్రామాల అభివృద్ధిలో కార్యదర్శుల పాత్ర కీలకమన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులరైజ్‌పై హర్షం

చిన్నకోడూరు(సిద్దిపేట): చిన్నకోడూరులో పంచాయతీ కార్యదర్శులు జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మతో కలిసి సీఎం కేసీఆర్, మంత్రులు హరీశ్‌రావు, దయాకర్‌రావు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు.

మిరుదొడ్డి(దుబ్బాక): మిరుదొడ్డి మండల కేంద్రంలో ఎంపీపీ గజ్జెల సాయిలు ఆధ్వర్యంలో జేపీఎస్‌లు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ సత్యనారయణ, ఎంపీఓ జహీలొద్దీన్, జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

మద్దూరు(హుస్నాబాద్): తహసీల్దార్ కార్యాలయంలో మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 16 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను తహసీల్దార్ భూపతి ఆయా గ్రామాల సర్పంచ్‌లతో కలిసి అందజేశారు. కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు వంగ భాస్కర్‌రెడ్డి, సర్పంచ్ సుందరగిరి స్రవంతి, సీనియర్ అసిస్టెంట్ యాదగిరి, బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, నాయకులు సుమన్ పాల్గొన్నారు.

◆ అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోండి

హుస్నాబాద్: పట్టణంలోని 17వ వార్డు సంజీవయ్య కాలనీలో సరస్వతీ శిశుమందిర్ పాఠశాల సమీపంలో రోడ్డును ఆక్రమించి అక్రమంగా ఇళ్లు నిర్మిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రాజమల్లయ్యకు మంగళవారం కాలనీవాసులు వినతిపత్రం ఇచ్చారు. రోడ్డును ఆక్రమించి ఇళ్లు కట్టడంతో 21 ఫీట్లు ఉన్న రోడ్డు 12 ఫీట్లకే పరిమితమైందన్నారు. దీంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, ఇరుకు రోడ్డుతో ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులకు విన్నవించినా చర్యలు చేపట్టడం లేదన్నారు. అక్రమ నిర్మాణాలను తొలగించే విధంగా అధికారులకు తగు ఆదేశాలు ఇచ్చి రోడ్డును వెడల్పు చేసి మురికి కాల్వ నిర్మాణం చేపట్టాలని వారు కోరారు.

◆ స్వార్థ రాజకీయాలు వద్దు

సిద్దిపేటజోన్: స్వార్థ రాజకీయాల కోసం కొందరు ఎన్నికల సమయంలో జిల్లాలోకి వస్తున్నారని, వారితో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్ సూచించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మంత్రి హరీశ్‌రావు, సీఎం కేసీఆర్‌పై విమర్శలు చేస్తున్న వారిపై జాగ్రత్తగా ఉండాలన్నారు. సిద్దిపేటలో రాబోయే ఎన్నికల్లో గులాబీజెండా అన్ని నియోజకవర్గాల్లో ఎగరాలని పిలుపునిచ్చారు. ప్రజల కోసం పనిచేస్తున్న మంత్రి హరీశ్‌రావును విమర్శించడం అర్థరహితమన్నారు.

◆ కనుల పండువగా వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

మద్దూరు(హుస్నాబాద్): మండల పరిధిలోని గాగ్గిళ్లాపూర్ గ్రామంలో అలివేలుమంగ సమేత వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు రెండోరోజు కనుల పండువగా కొనసాగాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్థాపిత దేవతపూజ, వాస్తు, యోగినీ, నవగ్రహ, క్షేత్రపాలక, సర్వతోభద్ర పీఠోపరి, దేవతా హవనం, ధాన్యాధివాసం, పుష్పధివాసం, శయ్యాధివాసం తదితర పూజా కార్యక్రమాలు అర్చకుడు తీగుళ్ల రామమూర్తిశర్మ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

◆ ఘనంగా మహంకాళీ విగ్రహ ప్రతిష్ఠ

మర్కూక్(గజ్వేల్): మండల కేంద్రమైన మర్కూక్‌లో మహంకాళీ ఆలయంలో మంగళవారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ మహోత్సవానికి ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా నర్సన్నపేట గ్రామంలో బొడ్రాయి ఉత్సవాల్లో పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు బొడ్రాయికి అభిషేకం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

◆ వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి

సిద్దిపేటరూరల్: వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, ఉద్యోగ భద్రత, ఇన్సూరెన్స్ తదితర సమస్యలను తక్షణమే ప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవి కుమార్ అన్నారు. మంగళవారం వీఓఏల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో సిద్దిపేట అర్బన్, రూరల్ మండల సమాఖ్య కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి వినతి పత్రం అందించారు.

‘కంటివెలుగు’ దేశానికే ఆదర్శం

ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి


వర్గల్(గజ్వేల్): కంటి అద్దాలు అందజేస్తున్న ప్రతాప్‌రెడ్డి

వర్గల్(గజ్వేల్): సీఎం కేసీఆర్ ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తున్న కంటివెలుగు దేశానికే ఆదర్శమని ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం వర్గల్ మండలం నెంటూరులో కంటివెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంధత్వం నివారణకు ఊరూరా కంటి వెలుగు శిబిరాలు యజ్ఞంలా కొనసాగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లతా రమేష్ గౌడ్, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు నాగరాజు, సాదుల్లాగౌడ్, లచ్చిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో రేణుకా ఎల్లమ్మ వార్షికోత్సవ వేడుకలలో పాల్గొన్నారు.

మర్కూక్(గజ్వేల్): మండలంలోని ఎర్రవల్లి గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ పాండుగౌడ్, సర్పంచ్ భాగ్యభిక్షపతి, ఎంపీటీసీ ధనలక్ష్మీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ములుగు(గజ్వేల్): మండలంలోని తున్కిబొల్లారంలో కంటివెలుగు శిబిరాన్ని ములుగు మండల పీఏసీఎస్ వైస్ చైర్మన్ నరేశ్‌గౌడ్, వైస్ ఎంపీపీ దేవేందర్ రెడ్డి, సర్పంచ్ పావణిలు ప్రారంభించారు.

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని వంగరామయ్యపల్లిలో కంటి వెలుగు శిబిరాన్ని ఎంపీపీ లకావత్ మానస ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయలక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు కార్యకర్తలే బలం

- ముచ్చటగా మూడోసారి అధికారంలోకి వస్తాం..
- హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

హుస్నాబాద్: హుస్నాబాద్ గడ్డ బీఆర్ఎస్‌కు అడ్డా అని, బీఆర్ఎస్ పార్టీకి కార్యకర్తలే బలమని ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని రాజ్యలక్ష్మి కన్వెన్షన్ హాల్‌లో మంగళవారం 11వ వార్డు నుంచి 20వ వార్డు వరకు పట్టణ స్థాయి బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తొమ్మిదేళ్లలో ఊహించని విధంగా హుస్నాబాద్ పట్టణం అభివృద్ధి జరిగిందన్నారు. ఒకప్పుడు హుస్నాబాద్ నియోజకవర్గం కరువు ప్రాంతంగా ఉండేదని, నేడు ఎండాకాలంలో కూడా చెరువులు అలుగులు పారుతున్నాయన్నారు. గోదావరి జలాలతో హుస్నాబాద్ నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తామన్నారు. ముచ్చటగా మూడోసారి బీఆర్ఎస్ పార్టీని అధికారంలోకి తెచ్చేలా కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. హుస్నాబాద్ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధికి ప్రతీకగా నిలిపామన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు. తెలంగాణలో ప్రతి గడపకూ కేసీఆర్ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, ప్రతిపక్షాలు మన ఎదుగుదలను తట్టుకోలేక తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయని, ఎక్కడికక్కడ కార్యకర్తలు తిప్పికొట్టాలని సూచించారు. క్షేత్రస్థాయిలో కార్యకర్తల సమన్వయం కోసమే ఆత్మీయ సమ్మేళనాలని ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఎడబోయిన రజని, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్వర్‌పాషా, వైస్ ప్రెసిడెంట్ చిట్టి గోపాల్‌రెడ్డి, కౌన్సిలర్లు వాల సుప్రజ, బొల్లి కల్పన, హరీశ్, వివిధ అనుబంధ సంఘాల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాదాసీదాగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

పలు ఎజెండా అంశాలపై ఆమోదం


మాట్లాడుతున్న చైర్‌పర్సన్ వనిత

దుబ్బాకటౌన్: దుబ్బాక మున్సిపాలిటీ అభివృద్ధే లక్ష్యంగా కోట్ల రూపాయలతో అనేక అభివృద్ధి పనులు చేపడుతున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ వనితాభూంరెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా 70 ఎజెండా అంశాలకు కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో పని చేస్తున్న 72 మంది సిబ్బంది జీతాలు, వారి ఈపీఎఫ్‌కు సంబంధించి ఏప్రిల్ 2023 నుంచి మార్చి 2024 వరకు నెలకు రూ.12,69,216 చొప్పున 12 నెలలకు గాను రూ.1,52,30,592ను సాధారణ నిధుల నుంచి ఖర్చు చేసేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపిందన్నారు. మున్సిపల్‌లోని వివిధ వార్డుల్లో 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా మంచినీటి సరఫరా, మురికి కాల్వల నిర్మాణం, శానిటేషన్ అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ.68.47లక్షలు ఖర్చు చేసేందుకు ఆమోదించామని తెలిపారు. శిథిలావస్థకు చేరిన పాత నగర పంచాయతీ భవనం కూల్చి వేసేందుకు పట్టణ ప్రగతి నుంచి రూ.2 లక్షలు, స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా వివిధ వార్డుల్లో డస్ట్‌బిన్స్ కొనుగోలు చేసేందుకు రూ.5లక్షల నిధులు మంజూరు చేశామన్నారు. మున్సిపల్ అభివృద్ధికి చేపట్టిన అన్ని అంశాలకు కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపిందని పేర్కొన్నారు. సమావేశంలో కమిషనర్ పాతూరి గణేశ్‌రెడ్డి, టీపీవో గిరిధర్, దిలీప్‌కుమార్, జ్యోతి, కౌన్సిలర్లు ఉన్నారు.

వైభవంగా ఎల్లమ్మ ఉత్సవాలు


చిన్నకోడూరు(సిద్దిపేట): పుట్ట వద్ద పూజలు చేస్తున్న జెడ్పీచైర్‌పర్సన్ రోజాశర్మ


దుబ్బాకటౌన్:ఎంపీ ప్రభాకర్‌రెడ్డిని సన్మానిస్తున్న గౌడసంఘం నాయకులు


హుస్నాబాద్: పట్నాలు వేస్తున్న భక్తులు


దుబ్బాకటౌన్: అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణంలోని రేణుకా ఎల్లమ్మ జాతర సందర్భంగా అమ్మవారికి ఇష్టమైన మంగళవారం అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. శివసత్తులు పూనకంతో ఊగిపోయారు. ఎల్లమ్మకు బోనాలు, ఒడిబియ్యం, చీరలు, గాజులు సమర్పించుకున్నారు. బైండ్ల పూజారులు పట్నాలు వేసి ఎల్లమ్మ కథను వినిపించారు. కోరిన కోరికలు తీర్చి చల్లంగా చూడాలని భక్తులు తలనీలాలు సమర్పించి అమ్మవారికి మొక్కులు సమర్పించుకున్నారు.

దుబ్బాకటౌన్: పట్టణంలో జరుగుతున్న ఎల్లమ్మ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రేణుకా ఎల్లమ్మ జమదగ్నిల కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఉత్సవాల్లో భాగంగా సోమవారం అర్ధరాత్రి 1 గంట వరకు గౌడ సంఘం, బాబు జగ్జీవన్‌రాం సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రధాన వీధుల గుండా కనుల పండువగా బోనాల ఊరేగింపు నిర్వహించారు. ఉత్సవాలకు ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే రఘునందన్‌రావులు హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని గౌడసంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని తిగుల్ గ్రామంలో రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ఉదయం ఎల్లమ్మ బోనాలు, చంద్ర పటం, ఎల్లమ్మ జమదగ్ని కల్యాణం నిర్వహించారు.

తొగుట(దుబ్బాక): మండలంలోని పెద్ద మాసాన్‌పల్లి రేణుకా ఎల్లమ్మ జమదగ్ని మహర్షిల కల్యాణోత్సవం మంగళవారం కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు. అనంతరం ఆలయంలో కల్యాణం నిర్వహించారు. మూడురోజులుగా కొనసాగిన ఉత్సవాలు నేటితో ముగిసినట్టు నిర్వాహకులు తెలిపారు.

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని చంద్లాపూర్‌లో నూతనంగా నిర్మించిన రేణుకా ఎల్లమ్మ ఆలయ కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం ఘనంగా పూజలు నిర్వహించారు. అమ్మవారికి బోనాలు తీశారు. పుట్టకు ధనిపోయుట వంటి కార్యక్రమాలతో పాటు హోమాలు నిర్వహించారు. ఈ పూజల్లో జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మతో పాటు సర్పంచ్ చంద్రకళ రవి, ఎంపీటీసీ దుర్గారెడ్డి, గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

దుబ్బాక: దౌల్తాబాద్ మండల పరిధిలోని దొమ్మాట ఎల్లమ్మ ఆలయంలో ఎమ్మెల్యే రఘునందన్‌రావు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ బాధ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు. అనంతరం ఆలయ అభివృద్ధి పనులను ఆయన పరిశీలించి ప్రహరీ నిర్మిస్తానని హామీనిచ్చారు.